## క్లుప్తంగా

### అభివృద్ధిలో హరిత రాయబారులే కీలకం



కార్యక్రమంలో మాట్లాడుతున్న సర్పంచ్ విజయలక్ష్మి

పెనుగొండ: చెత్త నుంచి సంపద తయారీ కేంద్రం ఎల్‌టీసీగా అభివృద్ధి చెందడానికి గ్రామంలోని హరిత రాయబారుల కృషేనని వడలి సర్పంచ్ కాసాని విజయలక్ష్మి అన్నారు. మంగళవారం వడలి పంచాయతీ పరిధిలోని ఎస్‌డబ్ల్యూపీసీ లోకల్ ట్రైనింగ్ సెంటర్ వద్ద నియోజకవర్గంలోని ఆచంట, పోడూరు, పెనుగొండ, పెనుమంట్ర మండలాలకు చెందిన సీఆర్‌పీలకు ఒక రోజు శిక్షణ ఇచ్చారు. సీఆర్‌పీలకు డీపీఆర్‌సీ కె.విశ్వనాథ్, సీహెచ్ పార్థసారథి, లలితలు శిక్షణ ఇచ్చారు. ఉప్పలపాటి చంటి మాట్లాడుతూ గ్రామాల సంపూర్ణ అభివృద్ధి మహిళలతోనే సాధ్యమన్నారు. స్వచ్ఛ గ్రామం అవ్వాలంటే ప్రతి ఇంటి నుంచి వచ్చే వ్యర్థాలను తడి, పొడి చెత్తలను వేరుచేసి ఇంటికి వచ్చే హరిత రాయబారికి అందించి సంపద సృష్టికి తోడ్పాటు నందించాలని కోరారు. హరిత రాయబారులు, పంచాయతీ సిబ్బంది, నాయకులు పాల్గొన్నారు.

### జాతీయ రహదారికి అనుసంధానం చేయండి



ఆందోళన చేస్తున్న గ్రామస్తులు

నరసాపురం రూరల్: మొగల్తూరు మండలం ముత్యాలపల్లి గ్రామంలో జాతీయ రహదారి నుంచి కొరువ గెద్దళ్ల వంపు వెళ్లే రోడ్డు మార్గం అనుసంధానం చేయాలని కోరుతూ మంగళవారం గ్రామస్తులు నిరసన చేపట్టారు. రోడ్డు అనుసంధానం సక్రమంగా లేక తరచూ ప్రమాదాలు సంభవిస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో సామాజిక సేవ కార్యకర్త నాగిడి రాంబాబు, దొంగ శ్రీను, కావూరు రమేష్, మామిడి శెట్టి నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

### కిల్కారీ కాల్స్‌పై అవగాహన



కిల్కారీపై అవగాహన కల్పిస్తున్న రాజు

పాలకొల్లు సెంట్రల్: గర్భిణీ నాలుగో నెల నుంచి పుట్టిన బిడ్డ సంవత్సరం వరకు కిల్కారీ కాల్స్ ద్వారా ఆరోగ్య సేవలు అందుతాయని కిల్కారీ ప్రోగ్రాం ఆఫీసర్ బి.రాజు అన్నారు. మంగళవారం లంకలకోడేరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆయన సందర్శించారు. మాత శిశు మరణాలు తగ్గించడానికి కేంద్రం ఈ కిల్కారీ సేవలను అందుబాటులోకి తీసుకొచ్చిందని చెప్పారు. కార్యక్రమంలో గుడాల హరిబాబు ఆరోగ్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

### అభివృద్ధి ప్రణాళికలు రూపొందించాలి

భీమవరం(ప్రకాశం చౌక్): జిల్లాలో పీఎంఏజీవై ఆదర్శ గ్రామాల అభివృద్ధి ప్రణాళికను రూపొందించి పనులు ప్రారంభించాలని కలెక్టర్ చదలవాడ నాగరాణి సంబంధిత అధికారులను ఆదేశించారు. మంగళవారం భీమవరం కలెక్టరేట్ చాంబర్‌లో కలెక్టర్ నాగరాణి ప్రధానమంత్రి ఆదర్శ గ్రామ యోజనపై గ్రామాల అభివృద్ధికి ప్రణాళికపై సంబంధిత అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ నాగరాణి మాట్లాడుతూ జిల్లాలో మొదటి విడత 11 గ్రామాలను, రెండో విడత 14 గ్రామాలను ఆదర్శ గ్రామాలుగా ఎంపిక చేసి 11 గ్రామాలకు బడ్జెట్ కేటాయించడం జరిగిందని తెలిపారు. 11 గ్రామాల్లో పనులను చేపట్టడం జరిగిందని అన్నారు. రెండు విడతలుగా ఎంపిక చేసిన గ్రామాల్లో గ్రామాభివృద్ధి ప్రణాళికలను వెంటనే సిద్ధం చేసి పనులను ప్రారంభించాలని సూచించారు. ఈ సమావేశంలో జిల్లా పరిషత్ సీఈవో ఎం.శ్రీహరి, డీపీఓ ఎం.రామ్నాథ్ రెడ్డి, ఇన్‌చార్జ్ జిలా ఎస్సీ వెల్ఫేర్ అధికారి ఏ.సూరిబాబు, డీఈఓ ఇ. నారాయణ, డీఆర్‌డీఏ పీడీ ఎంఎస్ వేణుగోపాల్ తదితరులు పాల్గొన్నారు.

### గ్యాస్ సిలిండర్ల స్వాధీనం

తణుకు అర్బన్: ఇంట్లో అక్రమంగా నిల్వ ఉంచిన గృహ వినియోగ రాయితీ గ్యాస్ సిలిండర్లను సివిల్ సప్లై అధికారులు స్వాధీనం చేసుకున్నారు. మంగళవారం పట్టణంలోని జీడిగుంట వారి వీధిలో అరవ ఉదయ భాస్కర రావు ఇంట్లో గ్యాస్ సిలిండర్లు నిల్వ ఉంచారనే సమాచారంతో సివిల్ సప్లై, ఫైర్ అధికారులు సంయుక్తంగా దాడి చేసి 33 గ్యాస్ సిలిండర్లు స్వాధీనం చేసుకున్నట్లు సివిల్ సప్లై డీటీ శ్రీదేవి తెలిపారు. గ్యాస్ సిలిండర్లను ఇంట్లో ఉంచి బ్లాక్ మార్కెట్లో వీటిని విక్రయిస్తున్నట్లు అధికారులు తెలిపారు. భాస్కరరావుపై కేసు నమోదు చేసినట్లు వివరించారు. ఈ దాడుల్లో అగ్నిమాపక అధికారి అజయ్‌కుమార్, పట్టణ ఏఎస్ఐ సత్యనారాయణ పాల్గొన్నారు.

# కుటీర పరిశ్రమలా నకిలీ మద్యం

వైఎస్సార్‌సీపీ అడ్వయిజరీ కమిటీ సభ్యుడు, మాజీ మంత్రి శ్రీరంగనాథరాజు



నకిలీ మద్యంపై వినతి పత్రం అందిస్తున్న మాజీ మంత్రి శ్రీరంగనాథరాజు, పార్లమెంటు పరిశీలకులు మురళీ కృష్ణంరాజు, నాయకులు





తూర్పుపాలెం కార్యాలయంలో ఏర్పాటుచేసిన కార్యకర్తల సమావేశంలో మాట్లాడుతున్న మాజీ మంత్రి శ్రీరంగనాథరాజు

పెనుగొండ: చంద్రబాబు పాలనలో నకిలీ మద్యం కుటీర పరిశ్రమగా తయారైందని, దీంతో పేదల ప్రాణాలకు ముప్పు వాటిల్లుతుందని వైఎస్సార్ సీపీ అడ్వయిజరీ కమిటీ సభ్యుడు, మాజీ మంత్రి చెరుకువాడ శ్రీరంగనాథరాజు విమర్శించారు. నకిలీ మద్యంపై మంగళవారం తూర్పుపాలెంలో నిర్వహించిన కార్యకర్తల సమావేశం నిర్వహించారు. అనంతరం జోరువానను సైతం లెక్కచేయకుండా ర్యాలీగా ఆచంట వెళ్లి తహసీల్దారు కార్యాలయంలో డెప్యూటీ తహసీల్దారుకు వినతిపత్రం అందజేశారు. చిత్తూరు జిల్లాలో భారీ స్థాయిలో నకిలీ మద్యం పట్టుబడిందని, కొన్ని నెలలుగా విజయవాడ, ఏలూరు, పరివాడ ప్రాంతాల్లో నకిలీ మద్యం తయారీ వెలుగులోకి వచ్చిందని శ్రీరంగనాథరాజు తెలిపారు. అయినా, కూటమి ప్రభుత్వంలోని నాయకులు నకిలీ మద్యం తయారీని ఆపలేదని ఆరోపించారు. కూటమి ప్రభుత్వం ఏర్పడిన నాటి నుంచి రాష్ట్రంలో ఇప్పటి వరకు 421 మంది నకిలీ మద్యం వల్ల మృతి చెందినట్టు వార్తా పత్రికలు చెబుతున్నాయన్నారు. నకిలీ మద్యంలో టీడీపీ నాయకుల ప్రమేయం ఉన్నట్టు స్పష్టంగా కనిపిస్తున్నా, దీనిని డైవర్షన్ చేయడం ద్వారా ప్రజలను మభ్య పెట్టాలని చూస్తున్నారని ఆరోపించారు. రాష్ట్రంలో రూ.5,280 కోట్లు ఒక్క ఏడాదిలోనే దోచుకొన్నారని ఆరోపించారు. నకిలీ మద్యంపై వాస్తవాలు తెలుసుకోడానికి సీబీఐ దర్యాప్తు చేయాలని డిమాండ్ చేశారు. వైఎస్సార్‌సీపీ హయాంలో పారదర్శకంగా మద్యం దుకాణాలు నడిచినా, టీడీపీ నాయకులు నెత్తినోరూ కొట్టుకొంటూ గగ్గోలు పెట్టారని గుర్తుచేశారు. నర్సాపురం పార్లమెంటు నియోజకవర్గ పరిశీలకులు ముదునూరి మురళీ కృష్ణంరాజు మాట్లాడుతూ రాష్ట్రంలో బెల్ట్ షాపులు విచ్చలవిడిగా ఏర్పాటు చేయడంతో, కల్తీ మద్యం అమ్మకాల వెనుక టీడీపీ పెద్దలు ఉన్నారని తెలిపారు. పేదలకు వైద్య విద్యను దూరం చేశారన్నారు. ప్రశ్నించేవారిపై అక్రమ కేసులు బనాయిస్తున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో పెనుమంట్ర జెడ్పీటీసీ కర్రి గౌరీ సుభాషిణీ, ఎంపీపీలు పూతినీడి వెంకటేశ్వరరావు (పెద్ద), కేవీ నారాయణ రెడ్డి (వాసు), మండల కన్వీనర్లు జక్కంశెట్టి చంటి, గూడూరి దేవేంద్రుడు, సర్పంచ్‌లు కోట సరోజినీ వెంకటేశ్వరరావు, మట్టా కుమారి, జక్కంశెట్టి శ్రీరాములు, సుంకర సీతారాం, గుబ్బల ఉషారాణి, వీర బ్రహ్మం, బుర్రా రవికుమార్, ఉప సర్పంచ్ భూపతిరాజు శ్రీనివాస వర్మ, ఎస్సీ సెల్ నియోజకవర్గ కన్వీనరు పిల్లి రుద్ర ప్రసాద్, నాయకులు కర్రి వేణుబాబు, పులిదిండి వెంకటేశ్వరరావు, పలివెల శ్రీను, పెచ్చెట్టి సత్యనారాయణ, కీర్తి తాతాజీ, మైలే ఏసురత్నం, మేడిచర్ల పండు, బాబూరావు, కేశవరపు గణపతి, దొంగ దుర్గాప్రసాద్, ముత్యాల నాగేశ్వరరావు, రెడ్డి గణేష్, చిటికెన బాబీ, తాడి సుబ్బిరెడ్డిలు పాల్గొన్నారు.

### మనోస్థైర్యంతో ముందుకు వెళ్లాలి



బాలికలతో మాట్లాడుతున్న సీడీపీఓ ఉమ

పాలకొల్లు సెంట్రల్: బాలికలు మనోస్థైర్యంతో అన్ని రంగాల్లో ముందుండాలని సీడీపీఓ ఎం ఉమ అన్నారు. అంతర్జాతీయ బాలికల దినోత్సవం సందర్భంగా మంగళవారం లంకలకోడేరు ఉన్నత పాఠశాలలో నిర్వహించిన కార్యక్రమంలో సీడీపీఓ ఉమ మాట్లాడారు. పోషకాహారం తీసుకుంటూ ఆరోగ్యపై ప్రత్యేక శ్రద్ధ వహించాలన్నారు. బాలురతో పాటు బాలికలకు చట్టపరంగా సమానహక్కులు ఉంటాయని తెలిపారు. రక్షణ పట్ల అవగాహన కలిగి ఉండాలన్నారు. చిన్న వయస్సులో వివాహాలు చేసుకోకూడదని తెలిపారు. సెల్ ద్వారా వచ్చే చెడు మెసేజ్‌లకు దూరంగా ఉండాలని సూచించారు. ప్రతి పాఠశాలలో బాలికలకు రక్త పరీక్షలు చేసి, హిమోగ్లోబిన్ శాతం తక్కువ ఉంటే ప్రతి గురువారం ఐరన్ మాత్రలు ఇస్తున్నట్టు చెప్పారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు రాజశేఖర్, ఆరోగ్య విస్తరణాధికారి గుడాల హరిబాబు, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ సుధ, అంగన్‌వాడీలు పాల్గొన్నారు.

### డ్రెయిన్‌లో పారని మురుగు

నరసాపురం: స్థానిక రాయిపేట డీసీసీబీ బ్యాంకు రోడ్డులో ఉన్న డ్రెయిన్‌లో మురుగు పారడంలేదు. దీంతో దుర్గంధం వెదజల్లుతోంది. అటుగా వెళ్లే విద్యార్థులు, ప్రజలు తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నారు. ఇటీవల మునిసిపల్ అధికారులు డ్రెయిన్లలో చేపట్టిన పూడికతీత పనులు కొన్ని ప్రాంతాలకే పరిమితమయ్యాయి. చాలా వరకు ప్రధాన ప్రాంతాల్లో అలాగే వదిలేశారు. డ్రెయిన్ సమస్యను పరిష్కరించాలని స్థానికులు కోరుతున్నారు.

### పారిశుద్ధ్య ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు

నరసాపురం: పట్టణంలోని అన్ని వార్డుల్లో పారిశుద్ధ్య ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు తీసుకుంటున్నామని మున్సిపల్ చైర్‌పర్సన్ బర్రి శ్రీవెంకటరమణ తెలిపారు. మంగళవారం ఆమె విలేరులతో మాట్లాడుతూ అధిక వర్షాలు నేపథ్యంలో పట్టణంలో సంపూర్ణ పారిశుద్ధ్య పనులు పేరుతో ప్రత్యేక డ్రైవ్ చేపట్టామన్నారు. నిత్యం డ్రెయిన్లు శుభ్రం చేసేలా, మురుగు నీరు నిల్వ ఉండకుండా చర్యలు తీసుకున్నామని చెప్పారు. దోమల నివారణకు చర్యలు తీసుకోవాలని శానిటరీ అధికారులను ఆదేశించినట్టు తెలిపారు.

### నేడు సంతకాల సేకరణ

ఉండి: రాష్ట్రంలో మెడికల్ కళాశాలలు ప్రైవేటు పరం చేయడాన్ని నిరసిస్తూ మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పిలుపు మేరకు వైఎస్సార్ సీపీ ఆధ్వర్యంలో కోటి సంతకాల కార్యక్రమాన్ని బుధవారం ఉండి రాజులపేటలో ఉదయం 9 గంటలకు ప్రారంభిస్తున్నట్లు పార్టీ మండలాధ్యక్షుడు పీఆర్‌కే ఆంజనేయరాజు తెలిపారు. ముఖ్య అతిథిగా వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ పీవీఎల్ నర్సింహరాజు హాజరవుతున్నారని, మండల పార్టీ నాయకులు, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొనాలని ఆయన కోరారు.

# పాఠశాలల్లో పనులపై నిర్లక్ష్యం



మల్లవరం హైస్కూల్ పై అంతస్తులో నిలిచిన నిర్మాణ పనులు



సీతారామపురం హైస్కూల్‌లో నిలిచిన అదనపు తరగతి గదులు



తూర్పుతాళ్లు హైస్కూల్‌లో నిలిచిన నిర్మాణాలు



చిట్టవరం హైస్కూల్ పై అంతస్తులో నిలిచిన తరగతి గదుల నిర్మాణ పనులు

- సర్కారు బడుల్లో నిలిచిన నాడు – నేడు పనులు
- గదుల కొరతతో విద్యార్థుల ఇక్కట్లు
- పట్టించుకోని పాలకులు

నరసాపురం రూరల్: ప్రభుత్వ పాఠశాలల్లో చేపట్టిన నాడు– నేడు పథకం రెండో దశ పనులు అసంపూర్తిగానే మిగిలిపోయాయి. తరగతి గదుల నిర్మాణం కొన్ని పునాదుల దశలో ఉండగా మరికొన్నింటికి తలుపులు, కిటికీలు అమర్చాల్సి ఉంది. ఈ పనులకు రంగులు వేయడంలోనూ పాలకుల నిర్లక్ష్యం కనిపిస్తోంది. విద్యార్థులకు సరిపడా గదులు లేకపోవడంతో వారు తీవ్ర అసౌకర్యాల నడుమ చదువు కొనసాగిస్తున్నారు.

**పనులపై ఏదీ శ్రద్ధ?**

గత వైఎస్సార్‌సీపీ హయాంలో నాటి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాఠశాలల అభివృద్ధి కోసం నాడు – నేడు పేరుతో రెండు విడదల పనులు చేపట్టారు. నరసాపురం నియోజకవర్గంలో తొలి విడత పనులు పూర్తయ్యాయి. దీంతో కార్పొరేట్ పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలలు తయారయ్యాయి. విద్యార్థుల నమోదు సంఖ్య కూడా పెరిగింది. నాడు – నేడు పథకానికి విశేష ఆదరణ లభించింది. ఐతే రెండో విడత పనులు చేస్తుండగా ఎన్నికలు రావడంతో అవి అసంపూర్తిగా మిగిలిపోయాయి. ఐతే రాష్ట్రంలో కూటమి పార్టీలు అధికారం చేపట్టి ఏడాదిన్నర గడుస్తున్నప్పటికీ నాడు – నేడు పనుల పూర్తికి శ్రద్ధ చూపడంలేదనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. తమకు ఎవరిపైనా కక్షలేదని చెబుతున్న విద్యాశాఖ మంత్రి లోకేష్ ప్రకటనలకు, ఆచరణకు పొంతన లేకుండా ఉందని పలువురు ఆరోపిస్తున్నారు. వివిధ దశల్లో నిలచిపోయిన ఈ పనులను వెంటనే పూర్తి చేస్తే విద్యార్థులకు మేలు కలుగుతుందని చెబుతున్నారు.

**అసంపూర్తిగా గదుల నిర్మాణం**

నరసాపురం, మొగల్తూరు మండలాల్లో 53 తరగతి గదుల నిర్మాణం అసంపూర్తిగా ఉంది. మొగల్తూరు మండలం పేరుపాలెం, కేపీపాలెం, మొగల్తూరు, ముత్యాలపల్లి, శేరేపాలెం, పిప్పళ్ల వారితోట ఉన్నత పాఠశాలల్లో 21 తరగతి గదుల నిర్మాణం, నరసాపురం మండలం చిట్టవరం, మల్లవరం, సీతారామపురం, దర్బరేవు, కాపులకొడప, తూర్పుతాళ్లు ఉన్నత పాఠశాలల్లో 32 అదనపు తరగతి గదుల నిర్మాణాలు నిలిచిపోయాయి. పలుచోట్ల కిటికీలు, గుమ్మాలు, విద్యుత్, పెయింటింగ్, ఫ్లోరింగ్ వంటి పనులు పూర్తి చేయాల్సి ఉంది. కొద్ది మొత్తం నిధులు విడుదల చేస్తే ఈ పనులన్నీ పూర్తికానున్నాయి.

### నిధులు విడుదల చేయాలి



నాడు – నేడు స్కీంలో చేపట్టిన పనులను తక్షణం పూర్తి చేయాలి. ఈ నిర్మాణాలు అసంపూర్తిగా ఉండటంతో విద్యార్థులు అవస్థలు పడుతున్నారు. మరి కొందరు విద్యకు దూరమవుతున్నారు. ప్రభుత్వం వెంటనే అసంపూర్తి నిర్మాణాల పూర్తికి నిధులు విడుదల చేయాలి. పనులు పూర్తిచేయాలి.

– పెంద్ర వీరన్న, మాజీ చైర్మన్, ఎంబీసీ కార్పొరేషన్

# తట్ట మట్టేసే దిక్కు లేదు



బస్టాండ్ వద్ద రోడ్డుపై ఉన్న పెద్ద గుంత

నరసాపురం: స్థానిక ప్రధాన ప్రాంతం బస్టాండ్ పక్క రోడ్డు ప్రమాదకరంగా మారింది. నిత్యం వేలాది మంది ప్రయాణించే ఈ రోడ్డుపై గుంత ఏర్పడింది. రోడ్డు నిర్మించడం దేవుడెరుగు, కనీసం ఓ తట్ట మట్టివేసి గుంత పూడ్చే పరిస్థితి కూడా లేకపోవడం విమర్శకు తావిస్తోంది. ఈ ప్రాంతంలో మోటార్ సైకిళ్లపై వెళ్లేవారు జారిపడిపోతున్నారు. ముఖ్యంగా స్కూటర్‌పై వెళ్లే మహిళలు వారంలో ఇద్దరు, ముగ్గురు పడిపోయి గాయాలపాలవ్వడం పరిపాటిగా మారింది. ఓవైపు వర్షాలు పడుతుండటంతో పరిస్థితి మరింత ప్రమాదకరంగా మారింది. అటు బస్టాండ్ పక్క నుంచి 216 జాతీయ రహదారికి అనుసంధానంగా ఈ రోడ్డు ఉంది. మున్సిపల్ అధికారులకు ఎన్నిసార్లు మొరపెట్టుకున్నా పట్టించుకోవడంలేదని స్థానిక వ్యాపారులు వాపోతున్నారు.

# ప్రజలకు మెరుగైన జీవనోపాధి కల్పించాలి



గోడపత్రికను ఆవిష్కరిస్తున్నర్న కలెక్టర్ నాగరాణి

భీమవరం(ప్రకాశం చౌక్): పట్టణ ప్రజలకు మెరుగైన జీవనోపాధుల కల్పనకు మెప్మా అధికారులు కృషి చేయాలని జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి తెలిపారు. జిల్లా కలెక్టర్ ఛాంబర్ నందు 'మెప్మా లైవ్లీ హుడ్ ప్రమోషన్ సెల్' గోడపత్రికను జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి మంగళవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ చదలవాడ నాగరాణి మాట్లాడుతూ పట్టణ ప్రాంతాల్లోని ప్రజలు వివిధ వ్యాపారాల స్థాపనకు ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేయించుకునేందుకు 'మెప్మా లైవ్లీ హుడ్ ప్రమోషన్ సెల్' ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. ఒక కుటుంబం, ఒక వ్యాపార వేత్త అనే నినాదంతో 51 రకాల వ్యాపార యూనిట్లకు సంబంధించిన బ్రోచర్‌ను రూపొందించడం జరిగిందన్నారు. బ్రోచర్లను పట్టణ ప్రజలకు పంపిణీ చేయాలని సూచించారు. వ్యాపారం చేయుటకు ఆసక్తి గలవారు ఆన్‌లైన్‌లో సులువుగా దరఖాస్తు చేసుకుని, ఒక మంచి ఆదాయ మార్గాన్ని ఇచ్చే వ్యాపారాన్ని ఏర్పాటు చేసుకొనేందుకు అవకాశం కల్పించామని తెలిపారు. దీనిని పట్టణ ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో ఇన్‌చార్జ్ మెప్మా ప్రాజెక్ట్ డైరెక్టర్ జి.హెప్సిబా, జిల్లా లైవ్లీ హుడ్ స్పెషలిస్ట్ సీహెచ్ నానీబాబు, జిల్లా ఐబీ సీహెచ్ మోహనరావు తదితరులు పాల్గొన్నారు.

## అధ్వానంగా చినమిల్లిపాడు రహదారి



కొల్లేరు తీరంలోని చినమిల్లిపాడు గ్రామంలో అధ్వానంగా ఉన్న ప్రధాన రహదారి

ఆకివీడు: కొల్లేరు తీర గ్రామమైన చినమిల్లిపాడు సమస్యలతో కొట్టుమిట్టాడుతోంది. గ్రామంలోని ప్రధాన రహదారి అధ్వానంగా తయారైంది. నడిచి వెళ్లడానికి వీలు లేకుండా రహదారి ఉంది. దుక్కి వర్షానికే గుంతలు గుంతలుగా మారి ప్రమాద భరితంగా ఉంది. అడుగు వేస్తే మడుగులోతులో కూరుకుపోయేటంతటి గుంతలతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నట్లు స్థానికులు వాపోతున్నారు. గత ప్రభుత్వంలో రోడ్డు నిర్మాణం కోసం రోడ్డు మార్జిన్లు వెడల్పు చేసి గ్రావెల్ వేశారు. అనంతరం ప్రభుత్వం మారడంతో తమ రోడ్డును పట్టించుకునే నాథుడులేడని వారు చెబుతున్నారు. రోడ్డు గుండా కొల్లేరు తీరంలోని చేపల చెరువులు, వ్యవసాయ భూములకు ప్రతి రోజూ అనేక మంది వాహనాలతోనూ, కాలినడకన వెళ్తుంటారు. చేపల చెరువులకు మేత తీసుకువెళ్లేందుకు వాహనాలు కూడా రాని పరిస్థితి ఏర్పడిందన్నారు. రహదారి బురదమయంగా మారడంతో బురదనీరు తమ వాకిళ్లల్లోకి, గోడలపైకి పడటంతో మారుతున్నాయని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రజా ప్రతినిధులు తమ గ్రామాన్ని పట్టించుకుని, రహదారి సమస్యను పరిష్కరించాలని వారు కోరుతున్నారు.

# పెట్టుబడి సాయం అందించాలి



తహసీల్దారుకు వినతి పత్రం అందిస్తున్న నాయకులు

పెనుగొండ: కౌలు రైతులకు అన్నదాత సుఖీభవ పెట్టుబడి సాయం వెంటనే అందించాలని ఏపీ కౌలు రైతు సంఘ జిల్లా అధ్యక్షుడు ఉందుర్తి శ్రీనివాసరావు, జిల్లా ప్రధాన కార్యదర్శులు మామిడిశెట్టి రామాంజనేయులులు డిమాండ్ చేశారు. ఈ మేరకు మంగళవారం ఆచంట తహసీల్దారు కార్యాలయం వద్ద నిరసన వ్యక్తం చేశారు. తహసీల్దారుకు వినతిపత్రం అందించారు. భూ యజమానుల సంతకంతో సంబంధం లేకుండా కౌలు గుర్తింపు కార్డులు ఇవ్వాలని, పంట నమోదు కౌలు రైతుల పేరున చేసి, దాని ఆధారంగా పెట్టుబడి సాయం వెంటనే ఇవ్వాలని కోరారు. రిజర్వు బ్యాంకు నిబంధనలు ప్రకారం ప్రతి కౌలు రైతుకూ రూ.2 లక్షల పంట రుణం ఇవ్వాలని పేర్కొన్నారు. జిల్లాలో వ్యవసాయంలో 80 శాతానికి పైగా కౌలు రైతులే సాగు చేస్తున్నారని తెలిపారు. కార్యక్రమంలో సంఘ నాయకులు కేతా పూర్ణారావు, కొండేటి సత్యనారాయణ, పుచ్చకాయల నాగరాజు, పి.మోహన్, గుడిపూడి వెంకటేశ్వరరావు, వి.బాలరాజు, గెద్దాడ శ్రీనివాస్, మామిడిశెట్టి సురేష్, మట్టా చంటి, ఎ.సత్యనారాయణ, దొడ్డా సుబ్బారావులు పాల్గొన్నారు.

### పౌష్టికాహారంతో సంపూర్ణ ఆరోగ్యం

తాడేపల్లిగూడెం రూరల్: గర్భిణులు తమ రోజువారీ ఆహారంలో చిరుధాన్యాలైన రాగులు, సజ్జలు, మినుములు, కొర్రలు వంటి వాటిని తీసుకోవాలని ఐసీడీఎస్ సీడీపీఓ టీఎల్ సరస్వతి సూచించారు. పోషణ్ మాసోత్సవాల్లో భాగంగా మంగళవారం మండలంలోని జగన్నాథపురం అంగన్‌వాడీ కేంద్రంలో పోషకాహారంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు.

### నకిలీ మద్యంపై నేడు ధర్నా

ఆకివీడు: నకిలీ మద్యం విక్రయాలపై ఈ నెల 15వ తేదీన స్థానిక ఎక్సైజ్ సర్కిల్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించనున్నట్లు పట్టణ వైఎస్సార్ సీపీ కమిటీ అధ్యక్షుడు అంబటి రమేష్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. సోమవారం జరగాల్సిన కార్యక్రమం వర్షం వల్ల వాయిదా పడిన విషయం విధితమే. నకిలీ మద్యం తాగి అమాయకులైన మద్యం ప్రియులు చనిపోతున్నారని, దీనిపై వైఎస్సార్ సీపీ అధినేత, మాజీ సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ఇచ్చిన పిలుపు మేరకు ధర్నా నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ధర్నాకు నియోజకవర్గ పార్టీ కన్వీనర్ పీవీఎల్.నర్సింహరాజు ముఖ్యఅతిథిగా పాల్గొంటారని, పట్టణంలోని వార్డు కౌన్సిలర్లు, ప్రజా ప్రతినిధులు, అనుబంధ సంఘాల ప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు, మహిళలు అధిక సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని ఆయన పిలుపునిచ్చారు.

### 32 మందికి ఉచిత వైద్య సేవలు

తణుకు అర్బన్: సజ్జాపురం సీనియర్ సిటిజన్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించిన ఉచిత వైద్య శిబిరంలో 32 మంది రోగులు హాజరయ్యారు. స్థానిక రాష్ట్రపతి రోడ్డులోని అసోసియేషన్ కార్యాలయంలో సీనియర్ వైద్యులు డాక్టర్ భూపతిరాజు రమేష్ చంద్రబాబు వృద్ధులకు వైద్యసేవలందించారు. బీపీ, సుగర్ పరీక్షలు ఉచితంగా నిర్వహించి పేద రోగులకు మందులు పంపిణీ చేశారు. అనంతరం వృద్ధులు తీసుకోవాల్సిన ఆహార అలవాట్లు, వ్యాయామం, నడక వంటి అంశాలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు అడ్డాల సత్యనారాయణ, పట్టణ అధ్యక్షుడు ఈదర ప్రసాదరావు, కార్యదర్శి కోసూరి గాంధీ, ఉపాధ్యక్షుడు ద్వారంపూడి బాపిరెడ్డి, సభ్యులు ఇవటూరి లక్ష్మణరావు, చేబ్రోలు సాధు పాల్గొన్నారు.